తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ' తరంగాలు ' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
శనివారం
21 మార్చి 2026
సంపుటి 03
సంచిక 162
పేజీలు 8
వెల రూ. 5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

# రాష్ట్ర బడ్జెట్ రూ. 3,24,234 కోట్లు

- సంకల్పంతో రూపుదిద్దుకున్న తెలంగాణ బడ్జెట్..
- సమగ్రాభివృద్ధికి బ్లూప్రింట్
- రూ. 3.24 లక్షల కోట్ల భారీ ప్రణాళిక
- ప్రతి వర్గానికి సంక్షేమం--అభివృద్ధి లక్ష్యం
- రైతు, మహిళ, యువతకు ప్రత్యేక ప్రాధాన్యం



**హైదరాబాద్, మార్చి 20 (తరంగాలు ప్రతినిధి):** రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ ప్రభుత్వం 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రతిపాదించింది. రైతు సంక్షేమం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అన్ని కీలక రంగాలకు సమతుల్యంగా కేటాయింపులు చేస్తూ ఈ బడ్జెట్ రూపొందించబడింది. పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు వెల్లడించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో బడ్జెట్‌కు ఆమోదం లభించగా, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టారు. పాలకులుగా కాకుండా ప్రజాసేవకులుగా పరిపాలన సాగిస్తున్నామని, ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజ్యాంగ విలువలకు కట్టుబడి పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొంది.

ఈ బడ్జెట్‌లో అత్యంత కీలక ఆకర్షణగా "ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" పథకాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనుంది. అదేవిధంగా చేయూత పథకం కింద 2 లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయడం, మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కొనసాగించడం, రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించడం, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వంటి పథకాలు కొనసాగుతున్నాయి. మహిళా శక్తి మిషన్ ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు బడ్జెట్ దారితీసింది. ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించడం ద్వారా విద్యార్థుల పోషకాహార స్థాయిని మెరుగుపరచనుంది. రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా మార్చి, కొత్తగా 15 కోర్సులను ప్రవేశపెట్టనుంది. ఏటీసీల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు నెలకు రూ.2,000 స్కాలర్‌షిప్ అందించనుంది. 105 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించడంతో పాటు ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 2,500 పాఠశాలలకు ప్రీ-ప్రైమరీ విభాగాలను విస్తరించనుంది.

వ్యవసాయ రంగానికి రూ.23,179 కోట్లు కేటాయిస్తూ రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఎకరాకు సంవత్సరానికి రూ.12 వేల పెట్టుబడి సహాయం అందించనుంది. సన్నవడ్లకు క్వింటాకు

➤ మిగతా 2వ పేజిలో..



# సుప్రీంకోర్టు ఆశ్రయించిన యువజంట


- ఇళ్ల నుంచి పారిపోయి ఢిల్లీ చేరిన ప్రేమికులు
- కుటుంబం నుంచి ప్రాణహాని ఆరోపణలు
- హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు సూచన

**న్యూఢిల్లీ, మార్చి 20(తరంగాలు ప్రతినిధి):** ప్రేమ వివాహం కోసం ఇళ్ల నుంచి పారిపోయిన ఓ యువజంట సుప్రీంకోర్టును ఆశ్రయించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బీహార్‌కు చెందిన 19 ఏళ్ల యువతి, ఉత్తరప్రదేశ్‌కు చెందిన 22 ఏళ్ల యువకుడు పరస్పరం ప్రేమించుకుని, కుటుంబ సభ్యుల వ్యతిరేకతను ఎదుర్కొంటూ ఢిల్లీకి చేరుకున్నారు. తమకు పెళ్లి చేసుకునే హక్కు ఉందని, కానీ కుటుంబం నుంచి ప్రాణహాని ఉందని పేర్కొంటూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ ఘటన ఆధునిక సమాజంలో ప్రేమ వివాహాలపై ఇంకా ఉన్న సామాజిక అడ్డంకులను మరోసారి వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ ఘటనలో ముఖ్యంగా యువతి చేసిన ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. తన తండ్రి, సోదరుడు తమను ఉరి తీస్తామని బెదిరించారని ఆమె వెల్లడించింది. భయంతో ఇద్దరూ తమ ఇళ్ల నుంచి పారిపోయి ఢిల్లీకి వచ్చారని తెలిపింది. ఇక్కడ

➤ మిగతా 2వ పేజిలో..

# ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై కేంద్రం ఉక్కుపాదం

- 300 కొత్త ప్లాట్‌ఫామ్‌లు బ్లాక్
- మొత్తం బ్లాక్ చేసిన వాటి సంఖ్య 8,400కు చేరిక
- కొత్త చట్టం కింద కఠిన చర్యలు
- యువత రక్షణ లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు




**న్యూఢిల్లీ, మార్చి 20(తరంగాలు ప్రతినిధి):** ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ యాప్‌లపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలను మరింత వేగవంతం చేసింది. దేశవ్యాప్తంగా అక్రమంగా కార్యకలాపాలు సాగిస్తున్న మరో 300 గ్యాంబ్లింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను తాజాగా బ్లాక్ చేసింది. దీంతో ఇప్పటివరకు బ్లాక్ చేసిన వాటి మొత్తం సంఖ్య 8,400కు చేరినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. బ్లాక్ చేసిన ప్లాట్‌ఫామ్‌లలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ యాప్‌లు, రౌలెట్, స్లాట్స్ వంటి క్యాసినో గేమ్‌లు, బెట్టింగ్ ఎక్స్ఛేంజ్‌లు ఉన్నాయి. అదనంగా సట్టా, మట్కా నెట్‌వర్క్‌లు, నిజమైన డబ్బుతో ఆడే కార్డ్ గేమ్ యాప్‌లు కూడా ఈ జాబితాలో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ప్లాట్‌ఫామ్‌లు వినియోగదారులను మోసం చేస్తూ భారీ ఆర్థిక నష్టాలకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. గత ఏడాది పార్లమెంట్ ఆమోదించిన ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం కింద ఈ చర్యలు చేపడుతున్నారు. 2025 అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వచ్చిన ఈ చట్టం తర్వాతే సుమారు 4,900 వెబ్‌సైట్లు బ్లాక్ చేయడం గమనార్హం. ఈ చట్టం ప్రకారం నిజమైన డబ్బుతో గేమ్‌లు నిర్వహిస్తే మూడేళ్ల వరకు జైలు శిక్షతో

➤ మిగతా 2వ పేజిలో..

# బడ్జెట్ ఆమోదం లేకుండా వేల కోట్ల ఖర్చు

- మండలి చైర్మన్‌కు మల్లన్న ఫిర్యాదు
- ఆర్థిక క్రమశిక్షణ ఉల్లంఘనపై తీవ్ర ఆరోపణలు
- క్యాగ్ నివేదికల ఆధారంగా కీలక అంశాల వెల్లడి
- విచారణకు, కఠిన చర్యలకు డిమాండ్



**హైదరాబాద్, మార్చి 20 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణలో గత పదేళ్లుగా శాసనసభ ఆమోదం లేకుండా వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఆరోపిస్తూ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ తక్షణ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం శాసనసభ ఆమోదం లేకుండా కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులు వినియోగించడం చట్ట విరుద్ధమని మల్లన్న పేర్కొన్నారు. అయినప్పటికీ

➤ మిగతా 2వ పేజిలో..

# గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన



- ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌పై ఆగ్రహం
- చట్టబద్ధత కల్పించాలని డిమాండ్
- హామీలు అమలు చేయలేదని విమర్శలు
- వివిధ వర్గాల సమస్యలపై నిలదీత

**హైదరాబాద్, మార్చి 20 (తరంగాలు ప్రతినిధి):** రాష్ట్రంలో ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ వద్ద నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని వారు విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన సందర్భంగా నేతలు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాల్సిన ప్రభుత్వం హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా రాష్ట్రాన్ని ఆగం చేశారని పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఇవ్వాల్సిన రూ.54,000 బాకీ ఎక్కడ అని నేతలు ప్రశ్నించారు. వృద్ధులకు నెలకు రూ.4,000 చొప్పున ఇవ్వాల్సిన సాయం కూడా అందడం లేదని తెలిపారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12,000 చొప్పున ఇవ్వాల్సిన సహాయం రెండు సంవత్సరాలకు రూ.24,000గా బాకీ పడిందని ఆరోపించారు. ఈ వర్గాలన్నీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని

➤ మిగతా 2వ పేజిలో..



## రాష్ట్ర బడ్జెట్ రూ. 3,24,234 కోట్లు

➢ మొదటి పేజీ తరువాయి



రూ.500 బోనస్ ఇవ్వనుంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.18 కోట్ల లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ కొనసాగుతుంది. సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు కేటాయించి పలు ఎత్తిపోతల పథకాలు, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. విద్యుత్ రంగానికి రూ.21,285 కోట్లు, విద్యా రంగానికి రూ.26,674 కోట్లు, వైద్య ఆరోగ్య రంగానికి రూ.13,679 కోట్లు కేటాయించింది. ఆరోగ్య రంగంలో ప్రజల హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయడం, కొత్తగా 17 మెడికల్ కాలేజీలు నిర్మించడం, సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్ ఆసుపత్రులు, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ప్రారంభించనుంది. ఉద్యోగులు, పెన్షనర్లకు నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేయనుంది.పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల అభివృద్ధికి కూడా పెద్దపీట వేసింది. మూసీ నది పునరుద్ధరణ, గోదావరి నీటిని తరలించడం, 39 ఎస్టీపీల నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రైలు, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి వంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించింది. భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం, పారిశ్రామిక హబ్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ల అభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

హోం శాఖకు రూ.11,907 కోట్లు కేటాయించి శాంతిభద్రతల పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై దృష్టి సారించింది. 2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు రూ.500 కోట్లు కేటాయించింది. క్రీడలు, పర్యాటక రంగాల అభివృద్ధి ద్వారా రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ప్రణాళికలు రూపొందించింది. మొత్తంగా ఈ బడ్జెట్‌ను తెలంగాణ ప్రజల ఆశలు, ఆశయాలకు ప్రతిబింబంగా ప్రభుత్వం పేర్కొంది. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ఆర్థిక క్రమశిక్షణతో ముందుకు సాగే విధంగా రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు మార్గదర్శిగా నిలుస్తుందని ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## సుప్రీంకోర్టు ఆశ్రయించిన యువజంట

కూడా తమ భద్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా, సహాయం చేయాల్సింది పోయి తమను అదుపులోకి తీసుకున్నారని వారు వాపోయారు. దీంతో తమకు ఎక్కడా రక్షణ లభించకపోవడంతో చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.శుక్రవారం ఉదయం సుప్రీంకోర్టు ప్రాంగణంలోని పార్కింగ్ ప్రాంతంలో న్యాయవాది హర్విందర్ చౌదరిని కలిసిన ఈ జంట తమ సమస్యను వివరించింది. సోషల్ మీడియాలో కోర్టులో పెళ్లి చేసుకోవచ్చని చూసి ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. వారి పరిస్థితిని అర్థం చేసుకున్న న్యాయవాది వెంటనే స్పందించి, జంట తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న బెదిరింపులను దృష్టిలో ఉంచుకుని కనీసం మూడు రోజులపాటు పోలీసు రక్షణ కల్పించాలని కోర్టును కోరారు. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. తక్షణ ఉపశమనం కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించడం సరైన మార్గమని సూచించింది. హైకోర్టులు ఇలాంటి కేసులను వేగంగా విచారించే అవకాశం ఉందని పేర్కొంది. పంజాబ్, హర్యానా హైకోర్టులో తన అనుభవం ప్రకారం ఇలాంటి కేసులు తరచుగా వస్తాయని, అవి త్వరగా పరిష్కారం పొందుతాయని ప్రధాన న్యాయమూర్తి వివరించారు.అదేవిధంగా, ఢిల్లీ హైకోర్టు ఈ కేసును అదే రోజు పరిగణనలోకి తీసుకుంటుందని నమ్మకం వ్యక్తం చేస్తూ జంటకు భరోసా ఇచ్చింది. అవసరమైతే హైకోర్టు రిజిస్ట్రార్‌కు సమాచారం అందజేస్తామని తెలిపింది. ఒకవేళ హైకోర్టులో న్యాయం లభించకపోతే తిరిగి సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని సూచించింది. ఈ ఘటన ప్రేమ వివాహాలపై కుటుంబ ఒత్తిడి, యువత భద్రత, న్యాయ పరిరక్షణ అవసరంపై మరోసారి చర్చకు దారితీసింది.

## ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై కేంద్రం ఉక్కుపాదం



పాటు భారీ జరిమానాలు విధించనున్నారు.

ఆన్‌లైన్ గ్యాంబ్లింగ్ వల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడం, యువత వ్యసనాలకు గురవడం, కొన్నిసార్లు ఆత్మహత్యలకు పాల్పడటం వంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ కఠిన చర్యలు చేపట్టింది. గేమింగ్ వ్యసనాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఆరోగ్య సమస్యగా గుర్తించిందని అధికారులు తెలిపారు. అయితే ఈ చట్టం అన్ని ఆన్‌లైన్ గేమ్‌లను వ్యతిరేకించడం లేదు. ఈ-స్పోర్ట్స్, విద్యా, సామాజిక ప్రయోజనాల గేమ్‌లను ప్రోత్సహిస్తూ, బెట్టింగ్, గ్యాంబ్లింగ్ గేమ్‌లను మాత్రమే నియంత్రిస్తోంది. వినియోగదారుల రక్షణ, పారదర్శకత లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు కొనసాగిస్తోంది.

# బడ్జెట్ ఆమోదం లేకుండా వేల కోట్ల ఖర్చు

➢ మొదటి పేజీ తరువాయి

2014 నుంచి 2024 వరకు ఈ నియమాలను ఉల్లంఘిస్తూ భారీగా ఖర్చులు చేసినట్లు ఆరోపించారు. ఇది ఆర్థిక క్రమశిక్షణను పూర్తిగా దెబ్బతీసిందని అన్నారు. కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలను ఉదహరిస్తూ మల్లన్న పలు కీలక వివరాలను వెల్లడించారు. 2014-15 నుంచి 2018-19 మధ్య సుమారు 84,650 కోట్ల రూపాయల అదనపు ఖర్చు శాసనసభ ఆమోదం లేకుండా జరిగినట్లు పేర్కొన్నారు. 2018-19లో 29,133 కోట్లకు పైగా, 2019-20లో 47,896 కోట్లకు పైగా అధిక వ్యయం జరిగిందని తెలిపారు.అలాగే బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోయినా పలు పథకాల పేరిట నిధులు మళ్లించినట్లు ఆరోపించారు. ఉపాధి హామీ పథకం, విద్యుత్ రంగం,



కార్పొరేషన్లు, ఆరోగ్య అత్యవసరాలు వంటి విభాగాల్లో భారీగా నిధులు వినియోగించినట్లు పేర్కొన్నారు. ఈ చర్యలు శాసనసభ అధికారాలను అవమానించే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మల్లన్న డిమాండ్ చేశారు. అవసరమైతే ఈ అంశాన్ని సభ హక్కుల ఉల్లంఘనగా పరిగణించి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజాధనాన్ని నియంత్రణ లేకుండా ఖర్చు చేసే పరిస్థితిని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి

- మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగ
- జకాత్, ఫిత్రా దానధర్మాలు ఆదర్శమని వ్యాఖ్య
- మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబాటు

**హైదరాబాద్, మార్చి 20 (తరంగాలు ప్రతినిధి):** రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.రంజాన్ మాసం ఆధ్యాత్మికతకు, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలుస్తుందని సీఎం అన్నారు. ఈ నెలలో ముస్లింలు పాటించే కఠిన ఉపవాసాలు, క్రమశిక్షణతో చేసే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా రూపంలో పేదలకు సహాయం చేయడం మానవాళికి గొప్ప సందేశమని ఆయన తెలిపారు. ఈ ఆచారాలు సమాజంలో సహానుభూతి, సేవాభావాన్ని



పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.తెలంగాణ రాష్ట్రం గంగా-జమునా సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోందని సీఎం పేర్కొన్నారు. అన్ని మతాలు, వర్గాలు కలిసిమెలిసి జీవించే సంస్కృతి రాష్ట్రానికి ప్రత్యేకతని ఆయన గుర్తు చేశారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సామరస్య వాతావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని సీఎం అన్నారు. ప్రజలంతా పరస్పర గౌరవంతో, సహకారంతో జీవిస్తే సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రంజాన్ పండుగ అందరికీ శాంతి, సుఖసంతోషాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ముగింపులో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ కలిసిమెలిసి ఆనందంగా జీవించాలని ప్రార్థించారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సు కలగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుకున్నారు.

## గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ నిరసన

➢ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నేతలు నిలదీశారు. నిరుద్యోగ భృతి ఎక్కడుందని ప్రశ్నించారు. పేదింటి ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయకపోవడం కూడా నిరాశ కలిగించిందని పేర్కొన్నారు. యువత, మహిళలు ప్రభుత్వంపై నమ్మకం కోల్పోతున్నారని అన్నారు. రాష్ట్ర సంపదను దోచుకుంటూ ప్రజలను గాలికి వదిలేసిందని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# హైదరాబాద్ ఉద్యోగులకు కేంద్రం శుభవార్త

- హెచ్‌ఆర్ఏ మినహాయింపు 50 శాతానికి పెంపు
- మెట్రో నగరాల జాబితాలో హైదరాబాద్‌కు స్థానం
- కొత్త ఆదాయపు పన్ను నిబంధనల అమలు
- పన్ను చెల్లింపుదారులకు కొత్త మార్గదర్శకాలు




**న్యూఢిల్లీ, మార్చి 20 (తరంగాలు ప్రతినిధి):** తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇంటి అద్దె భత్యం మినహాయింపును 50 శాతానికి పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై నగరాలకే ఈ సౌకర్యం పరిమితమై ఉండగా, తాజాగా హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, పుణే, అహ్మదాబాద్ నగరాలను కూడా ఈ జాబితాలో చేర్చింది. దీంతో ఈ నగరాల్లో పనిచేసే ఉద్యోగులకు గణనీయమైన పన్ను ఉపశమనం లభించనుంది. కేంద్ర ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను నిబంధనలు-2026ను నోటిఫై చేసింది. దాదాపు ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న పాత చట్టానికి బదులుగా కొత్త విధానాన్ని తీసుకువస్తోంది. ఇందులో భాగంగా ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చే నిబంధనలను గెజిట్ ద్వారా ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా మొత్తం ఎనిమిది ప్రధాన నగరాల్లో ఉద్యోగులు తమ వేతనంలో 50 శాతం వరకు హెచ్‌ఆర్ఏ కింద పన్ను మినహాయింపును పొందగలుగుతారు. ఈ కొత్త విధానం ప్రకారం 2027 జులైలో దాఖలు చేయబోయే ఆదాయపు పన్ను రిటర్నులకు ఈ మార్పులు వర్తించనున్నాయి. ఉద్యోగులకు ఇది గణనీయమైన ఆర్థిక ఉపశమనం కలిగించనుంది. ముఖ్యంగా నగరాల్లో నివాస ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రయోజనకరంగా మారనుందని నిపుణులు భావిస్తున్నారు. అయితే ఈ మినహాయింపును పొందాలంటే కొన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. పన్ను చెల్లింపుదారులు తాము నివసిస్తున్న ఇంటి యజమానితో ఉన్న సంబంధాన్ని వెల్లడించాల్సి ఉంటుంది. ఈ వివరాలను ఫారమ్ 124లో నమోదు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. పారదర్శకత కోసం ఈ కొత్త నిబంధనను అమలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పార్లమెంటు ఆగస్ట్ 12న కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో ఈ మార్పులు అమలులోకి వస్తున్నాయి. కొత్త విధానం ద్వారా పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఉద్యోగులపై పన్ను భారం తగ్గిస్తూ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ నిర్ణయం కీలకంగా నిలవనుంది.

## భద్రాచలం అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా రూపాంతరం
- మూడు దశల్లో ఆలయ అభివృద్ధి పనులు
- పుష్కరాల నాటికి తొలి దశ పూర్తి లక్ష్యం
- ట్రైబల్ మ్యూజియం, పరిసర దేవాలయాల అభివృద్ధి

**హైదరాబాద్, మార్చి 20(తరంగాలు ప్రతినిధి):** తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భద్రాద్రిని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర మంత్రులు తెలిపారు. ఆలయ రూపురేఖలను మార్చేలా సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు వెల్లడించారు.ఈ మాస్టర్ ప్లాన్‌పై శుక్రవారం సచివాలయంలో మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో కీలక సమావేశం జరిగింది. ఇందులో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి పాల్గొన్నారు. రెండు వందల సంవత్సరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ఆగమ శాస్త్రానికి అనుగుణంగా భక్తుల భావోద్వేగాలను గౌరవిస్తూ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. మూడు దశల్లో ఆలయ అభివృద్ధి చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పుష్కర ఘాట్‌తో పాటు మొదటి దశ పనులు పూర్తి



చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.

భద్రాచలాన్ని తెలంగాణలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని మంత్రులు పేర్కొన్నారు. భద్రాచలం సమీపంలోని రామవరం ప్రాంతంలో ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఈ మ్యూజియాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గోదావరి పుష్కరాల సందర్భంగా కొరివి వీరభద్రస్వామి, మల్లూరు నరసింహస్వామి దేవాలయాలను కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. భక్తులకు మరింత సౌకర్యవంతమైన దర్శనాన్ని కల్పించడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

THARANGALU DAILY NEWS
శనివారం, 21 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# ప్రకృతిని కాపాడడం అందరిబాధ్యత

•ఉరపిచుకలను కాపాడుకుందాం - డాక్టర్ అనితా రెడ్డి

•హన్మకొండ ప్రతినిధి, మార్చి 20,తరంగాలు :ప్రకృతిని కాపాడడం అందరి



బాధ్యత అని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు.మార్చి 20 ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రకృతి పర్యావరణ ప్రేమికురాలు, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ మరియు కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి గత ఇరవై సంవత్సరాలుగా పర్యా వరణ పరిరక్షణకు ఎన్నో కార్యక్ర మాలు నిర్వహించారు. అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.పిల్లలకు పెద్దలకు అవగాహన కల్పించడమే కాక వేసవిలో పిచకలు,పక్షుల దాహార్తి తీర్చడానికి మానవత్వంతో ఇంటిలో పెరడు, పిట్ట గోడలు డాబాల మీద నీటి ముంతలు ఏర్పాటు చేయమని ప్రజలకు అవగాహన కల్పించడమే కాక నీటి ముంతలు ఉచితంగా అందించారు. నిజానికి ఈ కాంక్రీటు యుగంలో ఉరపిచుకలు అంతరించి పోతున్నాయని వాటిని పరిరక్షించు కోవడం మన బాద్యత అని ప్రభుత్వం సైతం దీనిపై దృష్టి పెట్టాలని అన్నారు. అడవులను కాపాడడం ,చెట్లు పెంచడం, రేడి యేషన్తో కూడిన వస్తువుల వాడకం తగ్గించడం, నీటి తొట్లను,ఆహారపు గింజలు ఏర్పాటు చేయడం వంటివి చేయాలని ప్రకృతి ని మనం కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుందని భవిష్యత్తు తరాలకు అందించాల్సినవి కార్లు, బంగలాలు,బంగారం కాదని పకృతిని కాపాడి స్వచ్ఛమైన గాలి నీరు, స్వచ్ఛమైన ప్రకృతిని ఆస్తిగా అందించాలని అన్నారు.చిన్నతనం నుండే పిల్లలకు ప్రకృతి యెక్క గొప్ప దనం,అవసరం తెలియ జేయాలని, ప్రకృతి పట్ల ప్రేమని, ప్రకృతితో మమేకం అయ్యే విధంగా పిల్లలను పెంచాలని అన్నారు. మనషులలా గానే పశుపక్షాదులకు జీవించే హక్కు ఉందని వాటిని స్వేచ్ఛగా బతక నీయాలని అంరించి పోతున్న ఉరపిచ్చులను సమిష్టి కృషి తో కాపాడు కుందామని పిలుపు నిచ్చారు.తన ఇంటి ఆవరణలో వందల కొలది చెట్లు నాటి నీటి తొట్లను,ఆహారపు చిప్పలను ఏర్పాటు చేసి అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారు డాక్టర్ అనితా రెడ్డి.వాకర్స్ కు, వివిధ కాలనీ వాసులకు సైతం అవగాహన కల్పించారు. ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పిచ్చుకాపాడడంలో మనం బాధ్యత తీసుకొని వాటి జీవిత కాలం పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ఇండ్లలో, బయట నీటి చిప్పలను, చిరుధాన్యాలను ఏర్పాటు చేయాలని అందరిని విజ్ఞప్తి చేసారు.

# డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి భూమి పూజ

•మహనీయుల స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం


• జై భీమ్ యువజన పొదుపు సంఘం గౌరవ అధ్యక్షుడు - కందికట్ల వీరేష్



తరంగాలు, మార్చి:20, నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి: నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండలం కొత్తూరు గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి భూమి పూజ చేశారు. జై భీమ్ యువజన పొదుపు సంఘం గౌరవ అధ్యక్షులు కందికట్ల వీరేష్( న్యాయవాది) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కొత్తూరు గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మండలంలో మొదటిసారిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించడం కోసం భూమి పూజ కార్యక్రమం చేసుకోవడం మంచి కార్యక్రమం అన్నారు. భూమి పూజ కార్యక్రమంలో భాగంగా బౌద్ధ మత జెండాను సంఘం గౌరవ అధ్యక్షులు ఆవిష్కరించడం జరిగింది. మహనీయుల స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేస్తామని, అంబేద్కర్ తెలిపిన బోధించు, సమీకరించు, పోరాడు నినాదంతో ముందుకు వెళ్దామని వచ్చే నెల 14 న అంబేద్కర్ జయంతి వరకు విగ్రహాన్ని ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖానాపురం ఎస్ హెచ్ ఓ చాగర్ల రఘుపతి, కొత్తూరు గ్రామ సర్పంచ్ జాటోత్ వినోద్ కుమార్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, ఖానాపురం సర్పంచ్ దాసరి రమేష్, కల్లేపల్లి మాదిగ మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షులు మహంకాళి రత్నం, అంబేద్కర్ యువజన పొదుపు సంఘం జిల్లా అధ్యక్షుడు ఈదునూరి వెంకటేశ్వర్లు, అంబేద్కరిస్ట్ బరికెల శివ, డి ఎస్ పి పార్టీ నియోజకవర్గ బాధ్యులు,బౌద్ధ ఉపాసకులు తిరుపతి శంకర్, డాక్టర్ గద్ద వెంకటేశ్వర్లు, మాల మహానాడు నాయకులు దూడల సాంబయ్య, గ్రామ ఉపసర్పంచ్ ఆరే సంపత్, మాజీ సర్పంచ్ జెరిపోతుల వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు సురేష్, బాలు, గ్రామస్తులు నాంచారి కుమారస్వామి, కోరే రాములు, భాష బోయిన వెంకటేష్, అజ్మీర రాజు, జాటోత్ బాలాజీ, ఆంబోతు అశోక్ పాల్గొన్నారు.

# పశు సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యతతో అనుసరించాలి





• పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి

• పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం

పరకాల, మార్చి 20,తరంగాలు: పశు సంరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యతతో అనుసరించాలని పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి అన్నారు.హన్మకొండ జిల్లా పరకాల నియోజకవర్గం పరకాల మండలం పోచారం గ్రామంలో వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యం లో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు .రైతులకు వ్యవసాయం తో పాటు పశువులు కూడా ఎంతో కీలకం అని,రైతుల ఎదుగుదలకు కారణమైన పశు వులకు వైద్యసేవలు అందించటం చాలా సంతోషాన్నించిదని చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి తెలిపారు.అనంతరం పశువులకు మందులు టీకాలు పంపిణి చేశారు .ఈ కార్యక్రమం లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి,మార్కెట్ వైస్ చైర్మన్ మారేపల్లి రవీందర్ మార్కెట్ సూపర్వైజర్ వేణు గోపాల్,గ్రామ సర్పంచ్ పెంతల మధుకర్,ఉపసర్పంచ్ కొలపాక చందు,డాక్టర్స్ వినయ్,శ్రీరామ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ బుడిమే రాజయ్య, పెంద్యాలకుమారస్వామి, దాసరి బిక్షపతి, బొమ్మకంటి రుద్రమదేవి,చంద్రమౌళి, గ్రామ పెద్దలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో ఫ్రీ రంజాన్ వేడుకలు






• గీతాంజలి విద్య సంస్థల చైర్మన్ - డాక్టర్ వేములపల్లి సుబ్బారావు

తరంగాలు, మార్చి:20, నర్సంపేట, నియోజకవర్గ ప్రతినిధి


నర్సంపేట నియోజకవర్గం పట్టణంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ఫ్రీ రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముస్లిం ప్రజలు అందరూ ఎంతో వైభవంగా నిర్వహించుకునే పండుగ రంజాన్ అని పండుగ పురస్కరించుకొని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. భిన్నత్వంలో ఏకత్వం భారతదేశం ప్రత్యేకత అందుకే ప్రపంచ దేశాలలో ఎక్కడా లేని విధంగా రకరకాల మతాలవారు, భాషలవారు ఇక్కడ ఒకటిగా జీవిస్తారు. అందరూ అన్ని పండుగలను ఆదరించి, గౌరవించి జరుపుకుంటారు. అందులో భాగంగా గీతాంజలి స్కూల్ ముస్లిం విద్యార్థులు మరియు అధ్యాపకులు తోటి వారు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం రాజేష్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు మన దేశం వైపు గర్వంగా చూడడానికి కారణం భారతీయ ప్రజలందరూ కలిసికట్టుగా ఉండటమే అని అందుకు నిదర్శనం పాఠశాలలని చిన్నతనం నుండే విద్యార్థులకు పరమత సహనాన్ని అలవర్చే బాధ్యత అధ్యాపక బృందానికి ఉందని తెలియజేశారు. అలా ఇతర మతాలను, వారి పండుగలను, ఆచారాలను గౌరవించినప్పుడు వారు కూడా ఇతర మతాల పట్ల ప్రేమానురాగాలతో వ్యవహరిస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు పాల్గొని ఒకరికొకరు ఖర్జూర, మిఠాయిలు తినిపించుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

నర్సంపేట నియోజకవర్గ ప్రతినిధి : మార్చి 20,తరంగాలు :రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు.వరంగల్ జిల్లాలోని నర్సంపేట మార్కెట్ యార్డ్‌లో తెలంగాణ మార్క్‌ఫెడ్ మరియు నర్సంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పండించిన మొక్కజొన్నకు సరైన ధర లభించేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను విక్రయించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించడంతో పాటు తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు.మొక్కజొన్నలో తేమ శాతం (మాయిశ్చర్) 14 శాతానికి మించకుండా ఉండాలని తెలిపారు.క్వింటాల్‌కు రూ. 2400 ధర ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ పేర్కొన్నారు.రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని సూచించారు. రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.మార్కెట్ యార్డ్‌లో తాగునీరు, విశ్రాంతి సదుపాయాలు, షెడ్లు వంటి మౌలిక వసతులు కల్పించి రైతులకు అనుకూల వాతావరణం ఏర్పాటు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డిసిఓ నీరజ, డిఎం మార్క్ ఫెడ్ రంజిత్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్ రవిచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్లో కార్మిక వర్గానికి మొండి చేయి

- ఎన్నికలలో ఉద్యోగ - కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలు నీటి మూటలేనా?
- బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు - గోనె యువరాజు



తరంగాలు, మార్చి:20, నర్సంపేట, నియోజకవర్గ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్2026-2027 సంవత్సరానికి గాను కార్మిక వర్గానికి మొండి చేయి చూపారని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చిందని ఇచ్చిన హామీలు నెరవేరాలంటే బడ్జెట్ లో నిధులు కేటాయింపు లేకుండా ఏ విధంగా నెరవేరుతాయని ప్రశ్నించారు. ఇప్పటికీ మూడుసార్లు బడ్జెట్ లు ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఈసారైనా బడ్జెట్లో ఉద్యోగ, కార్మిక వర్గాలకు నిధుల కేటాయింపు జరగలేదని అన్నారు. ఆశాలకు, అంగన్వాడి లకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు 18 వేల రూపాయల చొప్పున మధ్యాహ్న భోజన కార్మికులకు వివోఏ లకు, ఆర్ పి లకు 10,000 రూపాయల చొప్పున మున్సిపల్ కార్మికులకు, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు 24 వేల రూపాయల చొప్పున అసంఘటిత కార్మికుల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఆటో కార్మికులకు పదివేల రూపాయల మృతి ఇస్తామని చెప్పి రెండున్నర సంవత్సరాలు గడిచినా బడ్జెట్ కేటాయింపులు లేకుండా వేతనాలు ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. ఒకపక్క కార్మికులు తమ వేతనాల కోసం సమ్మెలో పాల్గొంటున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# బడ్జెట్లో బీసీలకు మరోసారి మోసం

- 60 శాతం పైన ఉన్న బీసీలకు 5 శాతం లోపు నిధులు కేటాయించడం విడ్డూరం
- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



హైదరాబాద్, మార్చి 20,తరంగాలు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా విస్మరించిందని,బీసీలకు మరోసారి మోసం జరిగిందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర వ్యాఖ్యానించారు.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 3,24,234 కోట్ల భారీ బడ్జెట్ ను ప్రవేశపెట్టి జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు 5శాతం నిధులు కూడా కేటాయించకపోవడం విచారకరమని ఎంపీ రవిచంద్ర తన ప్రకటనలో పేర్కొన్నారు.సమగ్ర సర్వే సందర్భంగా బీసీల జనాభాను 40లక్షలకు పైగా తగ్గించి చూపడమే కాక, కామారెడ్డిలో ఆర్భాటంగా ప్రకటించిన 42శాతం రిజర్వేషన్లను అమలు చేయడంలో,ప్రతి ఏటా బడ్జెట్లో 20వేల కోట్ల చొప్పున కేటాయిస్తామన్న హామీని కాంగ్రెస్ సర్కార్ నిలబెట్టుకోవడంలో విఫలమైందని ఆయన మండిపడ్డారు.మంత్రిమండలిలో యాదవ,మున్నూరుకాపు,రజక, లంబాడీలకు స్థానం కల్పించకుండా, కార్పొరేషన్ ఛైర్మన్ల నియమాకాలలో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఎంపీ రవిచంద్ర ఆవేదన వెలిబుచ్చారు.ఎన్నికల సమయంలో యువత ఓట్ల కోసం 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీనిచ్చి నెరవేర్చకపోవడంతో విద్యావంతులైన నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు.వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న వారి ఫీజు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడం, బడ్జెట్లో ఆ ప్రస్తావనే లేకపోవడం శోచనీయమని ఎంపీ రవిచంద్ర అన్నారు.జర్నలిస్టుల సంక్షేమం గురించి భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనకపోవడం విచారకరమన్నారు.మంత్రివర్గంలోకి వెంటనే ముగ్గురు బీసీలను తీసుకోవాలని,42శాతం రిజర్వేషన్ల అమలునకు పార్లమెంటులో బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు కాంగ్రెస్ అధిష్టానాన్ని ఒప్పించి కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి పెంచాల్సిందిగా ఎంపీ వద్దిరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

# వాస్తవ పరిస్థితులకు భిన్నంగా బడ్జెట్

- బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ చిత్తశుద్ధిలేని పచ్చి అబద్దాల కూర్పు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



తరంగాలు, మార్చి:20, నర్సంపేట, నియోజకవర్గ ప్రతినిధి

నర్సంపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఈరోజు ప్రవేశపెట్టిన బడ్జెట్ పైన మాట్లాడుతూ వాస్తవ పరిస్థితులకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ ఈ సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టిందని, బట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ చిత్తశుద్ధిలేని పచ్చి అబద్దాల కూర్పుగా భావించవచ్చని, రాజీవ్ యువ వికాసం పేరుతో రాష్ట్ర నిరుద్యోగ యువతను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని బడ్జెట్లో ప్రస్తావిస్తున్నారు తప్ప అమలు చేయడం లేదని, వ్యవసాయ కూలీలకు ఒక్క రూపాయి బడ్జెట్ ద్వారా ఇవ్వడం లేదన్నారు. గత రెండు బడ్జెట్లలో ప్రవేశపెట్టిన అంశాలనే మళ్లీ ప్రస్తావించారు తప్ప ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులైన దేవాదుల కు ఈ బడ్జెట్లో కేటాయింపులు లేవని, వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం లేని బడ్జెట్ గా ఉందని అన్నారు. ఈ బడ్జెట్ రైతులను, వ్యవసాయ కూలీలను, కార్మికులను మోసం చేసిందన్నారు. సన్న వడ్లకు బోనస్ ప్రస్తావన లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిని ఈ బడ్జెట్ నిరాశపరిచిందని, ఏ ఒక్క హామీలకు కూడా సంపూర్ణంగా నిధులు కేటాయించలేదన్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు ఈ బడ్జెట్ పైన ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు





- ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి
- పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద

పర్వతగిరి,మార్చి 20,తరంగాలు :ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేసిన సహించబోమని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద స్పష్టం చేశారు.వరంగల్ జిల్లాలోని పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి, వైద్య సేవల అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్శనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్, హాజరు నమోదు పుస్తకాలు, ఔషధ నిల్వలు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే ప్రజల్లో వివాహ వయస్సుపై అవగాహన కల్పించి బాల్య వివాహాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించేందుకు అవసరమైన అనుమతులు పొందిన అనంతరం వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు.గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా పరిసరాల పరిశుభ్రతను నిరంతరం నిర్వహించాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాలను సమయానుకూలంగా సాధిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిదురు శంకర్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ రాజ్, డాక్టర్ మౌనిక, రెవెన్యూ, పంచాయతీరాజ్ మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు



**గోపాలపురం కంటెస్టెడ్ కార్పొరేటర్ రావుల వెంకట రమేష్ గౌడ్**

హన్మకొండ ప్రతినిధి, మార్చి 20,తరంగాలు : రంజాన్ మాసం అంతా ముస్లిం సోదర సోదరీమణులు ఎంతో భక్తి నిబద్ధతతోని ఉపవాస దీక్షలు ఆచరించి ఆధ్యాత్మిక విలువలను చాటుకున్నారని గోపాలపురం కంటెస్టెడ్ కార్పొరేటర్ రావుల వెంకట రమేష్ గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోపాలపురం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు శాంతి సోహార్దత సహనం మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఈ పవిత్ర రంజాన్ పండగ సమాజంలో ఐక్యతను మరింత బలపరచాలని ఆకాంక్షించారు అల్లాహ్ కృపతో గోపాలపురంలోని ప్రతి ముస్లిం సోదర సోదరీమణుల ఇళ్లల్లో సుఖశాంతులు నెలకొని అందరూ ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని కంటెస్టెడ్ కార్పొరేటర్ రావుల వెంకట రమేష్ గౌడ్ కోరుకున్నారు.

# పంచాయతీ భవన నిర్మాణానికి స్థల సేకరణ సభ



ఇల్లందు ప్రతినిధి మార్చి20,( తరంగాలు): ఇల్లందు మండలంలో ఉన్నటువంటి బాలాజీ నగర్ పంచాయితీకి నేటికీ పంచాయతీ భవనం లేకపోవడం తో, 99 రోజుల ప్రజాపాలనలో భాగంగా గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దమనుషుల తో కలిసి పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ భవన నిర్మాణ స్థలం పై వాళ్ల అభిప్రాయాలను అడిగి తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్,పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థలం సేకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాయం స్వాతి, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి కల్తీ రాజు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ కార్యాలయంలో కూనరిల్లుతున్న-సామాన్యుడు

- తాసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు మాయమవుతున్న వైనం
- సర్టిఫికెట్లు టేబుల్ పై పెట్టుకొని సంతకం చేయకుండా ప్రజలతో చెలగాటం




ఇల్లందు ప్రతినిధి మార్చి20, ( తరంగాలు): ఇల్లందు,పట్టణ మండలంలోని తహసిల్దార్ కార్యాలయానికి పోవాలంటేనే సామాన్యుడు భయపడే పరిస్థితి నెలకొందని పట్టణ, మండల ప్రజలు వాపోతున్నారు. కుల, ఆదాయ, మరణ ధ్రువీకరణ పత్రలతోపాటు ఏ దరఖాస్తు చేసుకున్న అవి పొందేందుకు చెప్పులు అరిగేలా తిరగాల్సివస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.జిల్లా కలెక్టర్ ను కలవాలని అర్జీ పెట్టుకున్న ఒక్క రోజులో కలవచ్చు కానీ, ఇల్లందు తాసిల్దార్ని కలవాలంటే నెలలు గడవాల్సిందే అంటున్నారు. తహసీల్దార్ టేబుల్ పై అనేక సర్టిఫికెట్లు సంతకం చేయనివి పక్కకు పడేసినవి ఉన్నాయని పేర్కొన్నారు. కొందరి సర్టిఫికెట్స్ అధికారులె పక్కకు పడేయడంతో మరల రెండో మారు దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని. వాళ్లు పక్కకు పడేసిన సర్టిఫికెట్ కట్టలో వెతకాల్సి వస్తుందని తెలిపారు.సర్టిఫికెట్ దరఖాస్తు చేసి రాకపోవడంతో విసిగి చెందిన దరఖాస్తుదారుడు ఆర్.ఐ వద్దకు వెళ్లి విడంబరంగా అడగగా పంపించాను అంటూ విసుకుంటు సెక్షన్ లో అడగమనటం, తీరా సెక్షన్లో అడిగితే నా వద్దకు రాలేదంటూ చికాకుగా సమాధానం డిప్యూటీ తాసిల్దార్ (డి.టి)కి చెప్పిన ప్రయోజనం లేకుండా పోయిందని తెలిపారు. తాసిల్దార్ ను కలుద్దాం అనుకుంటే సార్ ఒంటిగంట ఆయన రాకపోవడం వచ్చిన డ్యూటీ చేసేది పక్క నెట్టి,ఫోన్లతో బిజీగా ఉంటూ, తాసిల్దార్ హల్ తలుపులు దగ్గరకు వేసి తన పర్సనల్ వ్యక్తులతో మాట్లాడటంతో ఆరోజు పుణ్యకాలం కాస్త ముగుస్తుందని ప్రతి రోజు ఇదే తంతు అంటూ ఆగ్రహిస్తున్నారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల వల్ల జీతాలు అందించకపోవడంతో తాసిల్దార్ కార్యాలయ అధికారులు చేతి వాటాలకు పును కుంటున్నారేమోనని బహిరంగంగా మాట్లాడుకోవడం గమనార్హం.ఇల్లందు తహసిల్దార్ ప్రజలకు చేసే సేవ కంటే ప్రైవేటు వ్యక్తులకు చేసే సేవ ఎక్కువైందని,వాళ్లను కూర్చోబెట్టి మాట్లాడటంలో మక్కువ శ్రద్ధ చూపిస్తు,కార్యాలయానికి వచ్చిన వాళ్లను బయట ఎండలో, చెట్ల కింద ఉండేలా చేస్తున్న తీరును ప్రజలు నిత్యం మీడియాతో పంచుకుంటున్నారు అని పేర్కొన్నారు.ఎరోజు సర్టిఫికెట్లు ఆరోజు సంతకాలు చేయడంలో అభ్యంతరాలు ఎందుకు అంటూ ప్రశ్నలు గుప్పిస్తున్నారు...? సార్ వ్యవహార శైలితో విసుగు చెందుతున్నామని వాళ్ల బాధని వ్యక్తపరిచారు. ఇల్లందు తహసిల్దార్ కార్యాలయంలో నడుస్తున్న తీరుపై అలాగే అధికారులకు మధ్యవర్తులు గా వ్యవహరించే చేతివాటగల దందాపై జిల్లా అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

# రంజాన్ ముందస్తు వేడుకలు





● మనుషుల మధ్య సోదరభావాన్ని పెంపొందించే పవిత్ర పండుగ రంజాన్

●కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్

కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, మార్చి.20, తరంగాలు:కేసముద్రం మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో ముందస్తు రంజాన్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినం యొక్క ఆధ్యాత్మికత, ఉపవాస దీక్ష ప్రాముఖ్యత, సహనం మరియు దాతృత్వం వంటి విలువలను వివరించారు.రంజాన్ మనుషుల మధ్య సోదరభావాన్ని పెంపొందించే పవిత్ర పండుగ అని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ముస్లిం సిబ్బందిని ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. వారి సేవలను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలోప్రిన్సిపల్ చిర్ర నరేష్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంజాన్ పర్వదిన సందేశాలను ఆసక్తిగా వినిపించారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో సామాజిక, సాంస్కృతిక విలువలను పెంపొందించే విధంగా జరిగాయని నిర్వాహకులు తెలిపారు.

## మహిళా శిశు సంక్షేమ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలి

•హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ ప్రతినిధి, మార్చి 20,తరంగాలు : జిల్లాలో మహిళా శిశు దివ్యాంగులు వయో వృద్ధుల సంక్షేమ శాఖ పథకాలు, కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మహిళా శిశు సంక్షేమ శాఖ అభివృద్ధి, వివిధ కార్యక్రమాల అమలు తీరుపై ఆ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, అక్షయ పాత్ర భోజనం, పోషణ్ అభియాన్, పౌష్టిక ఆహారం,భేటీ బచావో.. భేటీ పడావో, అభివృద్ధి పనులు, తదితర అంశాలను ఇంఛార్జి జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, ఆయా విభాగాల అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ లోప పోషణ ఉన్న సామ్, మామ్ చిన్నారుల పట్ల ఆరోగ్యవంతంగా, బరువు పెరిగేవిధంగా మహిళా శిశు సంక్షేమ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల భవనాలు ఎక్కడైనా బాగాలేకపోతే స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లోకి మార్చేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. జిల్లాలో బాల్యవివాహాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బాలలకు సంబంధించి ఫిర్యాదుల కోసం ఉన్న చైల్డ్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098గురించి విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బాల్య వివాహాల నిలుపుదల/ నిర్మూలనపై ఈ నెల 26 న పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బాలల పరిరక్షణ విభాగం అధికారులు హాజరై బాల్య వివాహాల నిర్మూలనకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా సఖీ కేంద్రం సేవలను గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.భేటీ బచావో భేటి పడావో కార్యక్రమానికి సంబంధించి కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ కు వివరించారు.ఈ సమావేశంలో సీడీపీవోలు స్వరూప, ఉమా,ఎక్స్టెన్షన్ ఆఫీసర్ సింధురాణి, ఇంచార్జి డీసీపీవో ప్రవీణ్ కుమార్, ఎఫ్ఆర్ వో రవికృష్ణ, సఖీ కేంద్రం అడ్మిన్ హైమావతి, శిశు గృహ మేనేజర్ మాధవి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ భాస్కర్, డీహెచ్ డబ్ల్యూ కో ఆర్డినేటర్ కళ్యాణి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సర్కార్ బడ్జెట్లో వికలాంగులకు మొండిచేయి



• భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్

వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 20,తరంగాలు : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పై భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో ఏర్పాటు చేసిన సంఘం వర్ధన్నపేట మండలం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఇవాళ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టి బడ్జెట్ వికలాంగుల ఆశలపై నీళ్లు చల్లిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం అడుగుడుగునా వికలాంగుల సమాజాన్ని అణచివేసేందుకు కుట్ర చేస్తోందని ముఖ్యంగా ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన 'అభయహస్తం' మేనిఫెస్టోలో వికలాంగులకు ఇచ్చిన ఏ ఒక్క హామీకి సంబంధించి బడ్జెట్లో ప్రస్తావించకపోవడం దారుణమని అన్నారు.అధికారంలోకి వస్తే అదే నెల నుంచి వికలాంగులకు రూ. 6,000 పెన్షన్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం 2016 వికలాంగుల హక్కుల చట్టం అమలు బ్యాక్లాగ్ ఉద్యోగాల భర్తీ, వికలాంగుల కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు వంటి అంశాలపై బడ్జెట్లో నిధుల కేటాయింపు లేకపోవడం బాధాకరమని అన్నారు.ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనే వికలాంగులకు ఒక స్వర్ణయుగం లాంటిదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వికలాంగులకు కేవలం రూ.500 ఉన్న పెన్షన్ను కేసీఆర్ రూ. 4016కు పెంచి దేశానికే ఆదర్శంగా నిలిచారని కేసీఆర్ ప్రభుత్వం వికలాంగుల సహాయ ఉపకరణాల పంపిణీకి గతంలో భారీగా నిధులు కేటాయిస్తే, ప్రస్తుత రేవంత్ ప్రభుత్వం పైసా కేటాయించకుండా వికలాంగులను చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ ప్రభుత్వం తక్షణమే వికలాంగుల పట్ల తన విధానాలను మార్చుకుని అధికారంలోకి వచ్చిన నెల నుంచి వికలాంగుల పెన్షన్ 6000 ఇస్తామన్న హామీ ప్రకారం ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ఉన్న ప్రతి వికలాంగునికి 50వేల రూపాయలు బాకీ ఉన్నారని ఆ బాకీలను వెంటనే చెల్లించి వికలాంగుల సంక్షేమానికి పాటుపడాలని ముఖ్యంగా తన రెండు ఏండ్ల పరిపాలనలో రాష్ట్రంలో అట్టడుగును ఉన్న వికలాంగులకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్క హామీలనే నెరవేర్చలేని ముఖ్యమంత్రి , రాష్ట్రంలో ఉన్న సబ్బండ వర్గాలకు ఇచ్చిన హామీలను ఏ పాటికి నెరవేరుస్తారో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన చెప్పకనే చెబుతుందని రేవంత్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు వెంటనే కృషి చేయాలని లేనిపక్షంలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ వెల్లడించారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షు కొల్లూరి ఈదయ్య బాబు సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ షరీఫ్ జిల్లా నాయకుడు ఇస్లావత్ బాలకృష్ణ నాయకులు గోగుల శేఖర్ రెడ్డి సంగం మండల అధ్యక్షులు జిట్టబోయిన శ్రీనివాస్ మహిళా నాయకురాలు గుడిపల్లి సుమతి నిమ్మరపోయిన వీరమ్మ అలివేలు పూలమ్మ జిల్లేపల్లి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన వరంగల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మోహన్ గౌడ్




హైదరాబాద్, మార్చి 20,తరంగాలు : తెలుగు ప్రజల నూతన సంవత్సరమైన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్ లోని కొండా నివాసంలో వరంగల్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త ఆరంభాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షించారు. అలాగే వరంగల్ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై సేవాదళ్ నేతలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో శివ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న



కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,మార్చి.20, తరంగాలు:కేసముద్రం మున్సిపాలిటీ, మండల పరిధిలో చందు తండా గ్రామానికి చెందిన గుగులోత్ భద్రి - లింగ్య (లేటు) కుమార్తె గాయత్రి - రాజేష్ ల వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులనుకేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్నఆశీర్వదించి శుభాకాంక్షలుతెలిపారు.ఈ కార్యక్రమంలో బాదావత్ సుమన్, భూక్యా సురేష్,బానోత్ వెంకన్న, రంగా, సేవల్, కుమార్, సంతోష్, రాజేందర్, అజిత్, దుర్గప్రసాద్, తరుణ్, అఖిల్ తదితరలు ఉన్నారు.

## జాటోత్ లచ్చ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అల్లం నాగేశ్వర్ రావు



కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, మార్చి.20, తరంగాలు:జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి జాటోత్ లచ్చ నాయక్ ఇటీవలే మృతిచెందగా శుక్రవారం గూడూరు మండలం మచ్చర్ల గ్రామంలో నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారితోపాటు మాజీ ఉప్పసర్పంచ్ బానోత్ వెంకన్న,చిలువేరు సమ్మయ్య గౌడ్, భూమాటి పురుషోత్తం రావు, తదితరులు ఉన్నారు.

## పండగలు సంతోషంగా జరుపుకోవాలి

• కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్



కల్వకుర్తి మార్చ్ 20 తరంగాలు ప్రతినిధి

కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా రంజాన్ కిట్లు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా కల్వకుర్తి చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పండగలను ఆనందంగా,సంతోషంగా జరుపుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ గారు అన్నారు. శుక్రవారం కల్వకుర్తిఎమ్మెల్యేక్యాంపుకార్యాలయంలో ప్రభుత్వం ద్వారా వచ్చిన రంజాన్ తోఫా 1000 కిట్లను ముస్లిం సోదరులకు చైర్మెన్ బృంగి రత్నమాల అనంద్ కుమార్, వైస్ చైర్మెన్ శానవాజ్ ఖాన్ అందజేశారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి ఏదో విధంగా కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కల్వకుర్తి పట్టణంలో ఈద్గాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డిఓ.కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి,కౌన్సిలర్ లు మబ్బు రామరాజు, ఏజాస్,చిత్తరి శ్రీనివాసులు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు రమాకాంత్ రెడ్డి,మసూద్, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఖలీల్భాయ్,కాంగ్రెస్పార్టీ నాయకులు సోఫి,వాజీద్, అజీమ్ ,అయ్యాఖాన్,ముక్తాదర్,ఆరిఫ్, రెహమాన్,అఖిల్ తదితరులు పాల్గొన్నారులి

## ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు

- **కద్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్**

కల్వకుర్తి. మార్చి 20 తరంగాలు ప్రతినిధి



రంజాన్ మాసం అంతా ముస్లిం సోదర సోదరీమణులు ఎంతో భక్తి నిబద్ధతతోని ఉపవాస దీక్షలు ఆచరించి ఆధ్యాత్మిక విలువలను చాటుకున్నారని కద్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారుమాట్లాడుతూ కర్తాల్ నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి సోహార్దత సహనం మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఈ పవిత్ర రంజాన్ పండగ సమాజంలో ఐక్యతను మరింత బలపరచాలని ఆకాంక్షించారు. అల్లాహ్ కృపతో కర్తల్ మండల కేంద్రం లోని ప్రతి ముస్లిం సోదర సోదరీమణుల ఇళ్లల్లో సుఖశాంతులు నెలకొని అందరూ ఆరోగ్యంగా ఆనందంగా జీవించాలని కద్తాల్ మాజీ జెడ్పిటిసి లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోరుకున్నారు.

## బావి దగ్గర కరెంట్ షాక్‌తో రైతు మృతి



నర్సింహులపేట మార్చి 20 తరంగాలు మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం ముంగిమడుగు గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన డప్పు కాటి నరేష్ (41) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వ్యక్తి, కరెంట్ షాక్‌కు గురై మృతి చెందాడు.

**ఘటన వివరాలు:**

మృతుడి తండ్రి లాలయ్య (60) తెలిపిన వివరాల ప్రకారం, నరేష్ తన రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో వరి పంట వేసుకున్నాడు. పంటకు నీరు పెట్టేందుకు శుక్రవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో బావి దగ్గర మోటార్ ఆన్ చేయడానికి వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. అటుగా వెళ్తున్న అదే గ్రామానికి చెందిన డప్పు కాటి రాఘవులు ఈ ఘటనను గమనించి, ఉదయం 10 గంటల సమయంలో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు నరేష్‌ను ఆటోలో మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**వైద్యుల నిర్ధారణ..**

ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు మధ్యాహ్నం 12 గంటల 14 నిమిషాలకు నరేష్ మృతి చెందినట్లు ధృవీకరించారు.

**కుటుంబ సభ్యుల ఫిర్యాదు.**

ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**గ్రామంలో విషాదం.**

నరేష్ మృతి వార్త గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబానికి ప్రధాన ఆధారమైన నరేష్ ఆకస్మిక మృతి పట్ల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
పొలాల్లో విద్యుత్ పనులు చేసే సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని స్థానికులు కోరుతున్నారు

## ఆర్ఎంపీ డాక్టర్ కుటుంబానికి అల్లం నాగేశ్వర్ రావు పరామర్శ



కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, మార్చి.20,తరంగాలు:కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో 15వార్డుకి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆర్.ఎం.పి డాక్టర్ ఉప్పుల ఏకాంతం మేనత్త బండి భద్రమ్మ ఇటీవలే మృతి చెందగా శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను మండల కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావుతో పాటు జిల్లా ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి, మాజీ ఉప్పసర్పంచ్ బానోత్ వెంకన్న, చిలువేరు సమ్మయ్య గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక నాగరాజు, భూమాటి పురుషోత్తం రావు,అల్లం గణేష్ యాదవ్, బానోత్ బాధ్య, బానోత్ కిషన్,పాల ముకేష్,హరి కృష్ణ,గార్ల సాయి, గుగులోత్ రాజా శేఖర్, తదితరులు ఉన్నారు.

## నీళ్లు అడిగితే దెబ్బలేనా కారేపల్లి నిర్మల్ స్కూల్‌లో విద్యార్థులపై అమానుష వైఖరి”






కారేపల్లి టౌన్ తరంగాలు న్యూస్ మార్చి 20
ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని నిర్మల్ స్కూల్‌లో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. ఎటువంటి పాపం తెలియని చిన్నారులు దాహంతో మంచినీళ్లు అడగడానికి వెళ్లగా, స్కూల్ సిబ్బంది “ఆఫీస్ రూమ్‌లో లేవు” అంటూ నీళ్లు ఇవ్వకపోవడమే కాకుండా, వారిపై దురుసుగా ప్రవర్తిస్తూ కొట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల పట్ల ప్రేమతో, బాధ్యతతో ఉండాల్సిన గురువులు, సిబ్బంది ఇలా అమానుషంగా ప్రవర్తించడం పట్ల తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు కనీస అవసరమైన తాగునీరు కూడా అందించకపోవడం విద్యా వ్యవస్థపై ప్రశ్నార్థకం వేస్తోంది. ఈ ఘటనపై మండల విద్యాశాఖాధికారి వెంటనే స్పందించి, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. ఇక విద్యార్థి సంఘాల నాయకులు కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తూ, చిన్నారులపై ఇలాంటి అమానుష చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకుని, విద్యార్థుల హక్కులను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. “దాహంతో ఉన్న పిల్లలకు నీళ్లు ఇవ్వకుండా కొట్టడం ఎంతవరకు సమంజసం?” అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిన్నారుల హక్కులను రక్షించాల్సిన పాఠశాలల్లోనే ఇలాంటి ఘటనలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థుల భద్రత, సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


## జాటోత్ ఠాను నాయక్ 77వ వర్ధంతి ఘన నివాళులు”




కారేపల్లి టౌన్ తరంగాలు న్యూస్ మార్చి 20
ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం బంజారా కాలనీలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాను నాయక్ 77వ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. లంబాడి సంస్కృతి పరిరక్షణ ఆధ్వర్యంలో నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షులు భూక్యా రామకోటి రాథోడ్ పాల్గొని, జాటోత్ ఠాను నాయక్ పోరాట స్ఫూర్తి, త్యాగాలను స్మరించారు. ఆయన చేసిన సేవలు, రైతాంగ హక్కుల కోసం చేసిన పోరాటం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు, స్థానిక నాయకులు హాజరై ఆయనకు వినమ్ర నివాళులు అర్పించారు. వారి త్యాగాలు, పోరాటాలు నేటి తరాలకు మార్గదర్శకమని పలువురు అభిప్రాయపడ్డారు.

## ముగిసిన రంజాన్ ఉపవాసాలు

**నేడు పవిత్ర రంజాన్ పండగ**



హైదరాబాద్, మార్చి 20 పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు. దీంతో నెల రోజుల ఉపవాస దీక్షలను విరమించి పండగను జరుపకోబోతున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ నెల అత్యంత పవిత్రమైన రంజాన్ మాసం.

ఈ పవిత్ర మాసంలో ముస్లింలు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉండి ప్రార్థనలు ఆచరించారు. ఖురాన్ పఠించారు. ముఖ్యంగా ఈ మాసంలో దానధర్మాలు విరివిగా చేస్తారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసంలో ఆత్మ పరిశీలనకు, స్వీయ క్రమశిక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇలా నెల రోజుల ఉపవాసాల ఆనంతరం నెలవంక కనిపించిన తర్వాత ఈద్ అల్ ఫితర్ అంటే రంజాన్ పండుగ జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే అతిముఖ్యమైన పండుగల్లో రంజాన్ అత్యంత ప్రధానమైనది. ఎంతో భక్తి శ్రద్ధలతో నియమ నిష్టలతో రంజాన్ పండుగను ఆచరించారు. ముస్లిం ఆచరించే చంద్రమాన క్యాలెండర్‌లో రంజాన్ లేదా రమాదన్ అనేది తొమ్మిదో నెల. ఈ రంజాన్ పండుగ ఆధ్యాత్మిక చింతన, దానధర్మాలు, క్రమశిక్షణ వంటి వాటికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ రంజాన్ నెలలోనే పవిత్ర ఖురాన్ అవతరించిందని ముస్లిం పండితులు చెబుతారు. సాధారణంగా సౌదీ అరేబియాలో నెలవంక కనపించిన తర్వాతి రోజు భారత్‌లో రంజాన్ మాసంప్రారంభం కావడం అనేది ఆనవాయితీగా వస్తోంది. ఇక రంజాన్ పండుగ మార్చి 20 తేదీన నెలవంక దర్శనం ఆధారంగా జరుపుకుంటున్నారు.

## మధ్యప్రాచ్యంలో తగ్గని ఉద్రిక్తతలు

- **అమెరికా ,ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే దాడులు తప్పవు**
- **గల్ఫ్ దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు**

టెహ్రాన్,మార్చి20 మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన తరుణంలో, ఇరాన్ తన పొరుగు దేశాలకు కీలక విజ్ఞప్తి చేస్తూనే పరోక్ష హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడులు చేయడానికి అమెరికాకు, ఇజ్రాయెల్‌కు తమ భూభాగాలను లేదా సైనిక స్థావరాలను ఉపయోగించుకోనివ్వవద్దని పశ్చిమాసియా దేశాలను ఇరాన్ కోరింది. ప్రస్తుత సంక్షోభానికి ప్రాంతీయ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలే ముఖ్య కారణమని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ స్థావరాల నుంచే తమపై దాడులు జరుగుతున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. ఏ దేశం కూడా తన భూభాగాన్ని వేరొక దేశంపై దాడి చేయడానికి మూడవ పక్షానికి ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇవ్వకూడదని ఇరాన్ గుర్తు చేసింది. అమెరికా దాడులకు సహకరించే లేదా సౌకర్యాలు కల్పించే దేశాలను కూడా దురాక్రమణలో భాగస్వాములుగానే పరిగణిస్తామని, అటువంటి స్థావరాలు తమకు 'లక్ష్యాలు' అవుతాయని ఇరాన్ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ హెచ్చరించారు. తమ సార్వభౌమాధికారంపై దాడులు జరిగితే, అంతర్జాతీయ చట్టాల ప్రకారం తమను తాము రక్షించుకునే హక్కు తమకు ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. సౌదీ అరేబియా వంటి దేశాలు చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, ఈ ప్రాంతంలో అస్థిరతకు అమెరికా, జియోనిస్ట్ (ఇజ్రాయెల్) శక్తులే కారణమని ఇరాన్ విమర్శించింది.

## ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు

- **ఎరువుల సరఫరాను నిలివిపేయనున్న చైనా**
- **భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు**
- **పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం**

న్యూఢిల్లీ,మార్చి20 ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది. ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం.2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్‌సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని గత నెలలో ఎన్‌డీఆర్‌సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సంస్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థానంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి.

THARANGALU DAILY NEWS
శనివారం, 21 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ఉపాధి హామీ పనిపై అధికారుల నిర్లక్ష్యం



ఆత్మకూరు, మార్చి 20, తరంగాలు :జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న వికలాంగులైన ఉపాధి కూలీలు ఎండలో మండుతుంటే ఫీల్డ్ అసిస్టెంట్ టెక్నికల్ అసిస్టెంట్ ఇతర అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొందని వికలాంగులైన ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామంలోనూ వివిధ గ్రామాలలోనూ వికలాంగులైన ఉపాధి కూలీలు ఉదయం 8:00 నుండి 11:30 వరకు వారికి కేటాయించిన పనిలో పనిచేసి దానిని పూర్తిచేసుకుని వారు ఫోటో అప్లోడ్ కోసం ఫీల్డ్ అసిస్టెంట్ కోసం కనీసం ఐదు గంటలు ఎదురుచూసినా కూడా ఫోటో అప్లోడ్ చేసుకునే ఏ అధికారి కూడా అక్కడికి రాకపోవడంతో ఉపాధి కూలీలు మండుటెండలో సైతం ఎదురుచూస్తూ ఉండిపోయారు. మేము అసలే వికలాంగులం మాపైన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ఆ గ్రూపు మేటు పావుశెట్టి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మేము ఉదయాన్నే మాకు నిర్ణయించిన పని మేము చేసి పూర్తి చేసిన తర్వాత కూడా ఫీల్డ్ అసిస్టెంట్ ఫోటో తీయడానికి రావడంలో చాలా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆరోపించారు .పై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్న కూడా లాభం లేదన్నారు .ఇప్పటికైనా మా గ్రూపు సభ్యులం వర్క్ పూర్తి చేసిన తర్వాత ప్రతి నాలుగు గంటలకు ఫోటో అప్లోడ్ చేయాలని కోరుచున్నామన్నారు. కానీ ఫీల్డ్ అసిస్టెంట్ ఉదయం 11 గంటలకు వచ్చి ఫోటోలు తీసి మళ్లీ మధ్యాహ్నం మూడు గంటలకు వస్తే మిమ్మల్ని ఫోటో తీస్తానని చెబుతున్నారు అయినా కూడా మేము ప్రతిరోజు మండుటెండలో వచ్చి ఫోటో దిగుతున్నాము మా వికలాంగుల గ్రూప్ పైన ఇంత నిర్లక్ష్యం మా అని వారు అధికారులపై మండిపడుతున్నారు.

## రంజాన్ ముబారక్

మంజుల పత్తిపాటి



నిశీథ గగన గర్భంలో నీలిమను చీల్చిన నెలవంక,
నిశ్శబ్దాన్నే నాదముగా మలిచిన పవిత్ర సంకేతం---రంజాన్!
కాలచక్రపు గర్భగుహలో కలుగజేసే ఆత్మ జాగరణ,
కర్మల కన్నాడిలో మనిషిని తానే దర్శించుకునే దివ్య సమయం!
ఆకలి ఇది కేవలం శరీర వ్యధ కాదు,
ఇది మనసును మేల్కొలిపే మౌన ఉపన్యాసం!
పేదవాడి కడుపులో మ్రోగే ఖాళీ శబ్దం,
సమాజపు నిర్లక్ష్యానికి ప్రతిధ్వని---దాన్ని వినమని చెప్పే రంజాన్ ధ్వని!
ఉపవాసం---ఇది ఆహార నిరాకరణ కాదు,
ఇది ఆత్మను ఆరాధించే అగ్ని యజ్ఞం!
ఇంద్రియాల ఆందోళనలను అణచి,
మనసు మలినాలను దహించే మహా తపస్సు!
నమాజ్ పిలుపులో నడిచే ప్రతి అడుగు,
దైవానికి చేరువయ్యే సత్య మార్గం;
ప్రార్థనలో జారే ప్రతి కన్నీటి బిందువు,
పాపాలను పారద్రోలే పవిత్ర గంగ!
ద్వేషం---దహనమై భస్మమవ్వాలి,
అహంకారం-అస్తమించిపోవాలి;
ప్రేమే పరమ మంత్రంగా మారి,
మనిషి మనిషికి దైవ రూపమై నిలవాలి!
జకాత్---ఇది దానం కాదు, ధర్మ స్వరూపం!
పేదవాడి చేతిలో పడే ప్రతి గింజ,
దైవ కృపగా మొలకెత్తి
సమానత్వపు వృక్షమై విరాజిల్లాలి!
రంజాన్---ఇది ఒక మాసం కాదు,
ఇది మానవత్వానికి మహాగ్రంథం!
ఇది కేవలం ఆచారం కాదు,
ఇది ఆత్మను ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లే సాధన!
నెలవంక చిరునవ్వు వెనుక దాగిన సందేశం---
"మనసు మారితే ప్రపంచం మారుతుంది" అనే సత్యం!
అందుకే ఈ పవిత్ర వేళలో
మనలోని చీకట్లను చీల్చి వెలుగై మారుదాం!
అల్లాహ్ కరుణ కిరణాలు ప్రపంచాన్ని తాకగా,
ప్రతి హృదయం ప్రార్థనగా మారాలి;
ప్రతి మనిషి ప్రేమగా మారాలి;
ప్రతి జీవితం శాంతి గీతంగా మారాలి!
ఇదే రంజాన్ సందేశం---ఇదే మానవ ధర్మం!

అల్లాహ్ ఈ రంజాన్ మాసం వేళ మీకు మీ కుటుంబ సభ్యులకు శ్రేయస్సుతోపాటు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ రంజాన్ పండుగ శుభాకాంక్షలు.

రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218.

## భద్రకాళి అమ్మవారికి లిల్లీ పూలతో లక్ష పుష్పార్చన








వరంగల్ ప్రతినిధి, మార్చి 20,తరంగాలు :శ్రీ భద్రకాళి అమ్మవారికి లిల్లీ పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. చరిత్ర ప్రసిద్ధిగాంచిన వరంగల్ మహానగరంలోని శ్రీ భద్రకాళీ దేవస్థానం లో శ్రీ పరాభవ నామసంవత్సర యుగాది (ఉగాది) నుండి శ్రీ భద్రకాళీ వసంత నవరాత్రి మహోత్సవాలు దివి: 19-03-2026 గురువారం నుండి 27-03-2026 శు క్రవారం వరకు అత్యంత వైభవోపేతం గా నిర్వహింపబడుతాయి. వసంత నవరాత్రమహోత్సవములు శుక్రవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ రెండవ రోజు కార్యక్రమములో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం జరుపడిన పిమ్మట అమ్మవారికి లక్ష లిల్లీ పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు . ఈ కార్యక్రమం శ్రీ భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ముఖ్య అర్చకులు వెంకటనాగరాజ శర్మలు వేద విద్యార్థులు నిర్వహించారు. లక్ష పుష్పార్చనకు ఉభయదాతలుగా వరంగల్ ప్రముఖ వ్యాపారి సురినేని నవీన్రావు, నీరజ దంపతులు వ్యవహరించారు. శు క్రవారం కూడా కావడంతో భక్తులు అమ్మవారి దర్శనమునకు పోటెత్తారు. ఈ వసంత నవరాత్రులలో అమ్మవారికి నిర్వహించు లక్ష పుష్పార్చన భక్తులు దర్శించుకొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కార్యనిర్వహణాధికారి రామల సునీత కోరారు. ఈ రోజు లక్షపుష్పార్చన కార్యక్రమంలో ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి,గాండ్ల స్రవంతి, పాలడుగుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేత శివ నాయక్



కారేపల్లి టౌన్, మార్చి 20, తరంగాలు :ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలోని మేకల తండాలో ఇటీవల మరణించిన కార్యకర్తల కుటుంబ సభ్యులను సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి భూక్యా శివ నాయక్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం శివ నాయక్ మాట్లాడుతూ బానోత్ వెంకట్రావు, ఆంగోత్ రమేష్ మరణం పార్టీకి, వారి కుటుంబాలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఐఎఫ్టీయూ సంఘ సభ్యుడిగా వెంకట్రావు ఎంతో నిజాయితీతో పనిచేస్తూ, సంఘం పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో ముందు వరుసలో ఉండి పోరాటాలకు అంకితభావంతో కృషి చేసేవారని గుర్తు చేశారు. అలాగే ఆంగోత్ రమేష్ తన ఇంటర్మీడియట్ సహాధ్యాయిగా విద్యార్థి దశ నుంచే పిడిఎస్‌యూలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. తెలంగాణ ఉద్యమ పోరాటాల్లో ఆయన చురుగ్గా పాల్గొని, సంఘం పిలుపునిస్తే వెనుకాడకుండా ముందుండేవారని కొనియాడారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు స్నేహితులు వేర్వేరు కారణాలతో మరణించడం అత్యంత బాధాకరమని శివ నాయక్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఎల్లవేళలా వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ముస్లిం మహిళలకు రంజాన్ కిట్లు పంపిణీ

- ముస్లిం సోదరి,సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన
- నల్లబెల్లి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్,ఉపసర్పంచ్ మేకల దేవేందర్



వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 20,తరంగాలు : వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మహిళ సోదరీమణులకు ప్రభుత్వం ద్వారా ఈద్ ముబారక్ తోఫా కిట్లను గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్, ఉపసర్పంచ్ మేకల దేవేందర్ పంపిణీ చేశారు .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ రంజాన్ మాసం అనేది ముస్లిం సోదరులు ఎంతో పవిత్రంగా భావించి ఉపవాస దీక్షలతో క్రమశిక్షణగా దాతృత్వం ధార్మిక చింతనల కలయికతో పవిత్ర రంజాన్ మాసాన్ని కొనసాగిస్తూ ఆధ్యాత్మిక భావనలతో ఇతరులకు సహాయం చేయాలనే సంకల్పంతో ఉపవాస దీక్షలు సాగుతాయని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మైనార్టీలకు అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మేకల దేవేందర్, వార్డు సభ్యులు మహమ్మద్ జమీలబీ, మైనార్టీ సంఘం అధ్యక్షులు మహమ్మద్ జాఫర్ మియా, రఫిక్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## బండి భద్రమ్మకు ఘన నివాళి

### డాక్టర్ ఉప్పుల ఏకాంతం కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ఓదార్పు



కేసముద్రం, మార్చి 20,తరంగాలు : కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ ఆర్.ఎం.పి డాక్టర్ ఉప్పుల ఏకాంతం మేనత్త బండి భద్రమ్మ ఇటీవల కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు,మున్సిపల్ చైర్మన్ బానోత్ సునీతా వెంకన్న నాయక్, ఆర్ టి ఏ మెంబెర్ రావుల మురళీ, గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మిగౌడ్ చిలువేరు శుక్రవారం మృతురాలి నివాసానికి చేరుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రమ్మ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం పుత్రశోకంలో ఉన్న డాక్టర్ ఏకాంతం మరియు ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక నాగరాజు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారితో పాటు భూమాటి పురుషోత్తం రావు, అల్లం గణేష్ యాదవ్, బానోత్ బాధ్య, బానోత్ కిషన్, పాల ముకేష్, హరి కృష్ణ, గార్ల సాయి, గుగులోత్ రాజా శేఖర్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

THARANGALU DAILY NEWS
శనివారం, 21 మార్చి, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే నాగరాజు



వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 20, తరంగాలు :పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వర్ధన్నపేట నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులకు వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రంజాన్ మాసం ఆత్మపరిశుద్ధికి, నియమ నిష్ఠలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఉపవాస దీక్షలు మనసుకు నియంత్రణను, జీవనంలో క్రమశిక్షణను అందించడంతో పాటు, సమాజంపై సేవా దృక్పథాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈద్–ఉల్–ఫితర్ పండుగ ఉపవాస దీక్షల అనంతరం ఆనందాన్ని పంచుకునే పవిత్ర వేడుకగా భావించబడుతుందని తెలిపారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవాన్ని పెంపొందించడంలో రంజాన్ ప్రత్యేకమైన ప్రాధాన్యత కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో వివిధ మతాల ప్రజలు ఐక్యంగా, సామరస్యంతో జీవించడం రాష్ట్ర గొప్ప సంప్రదాయమని, ఈ సంస్కృతి మరింత బలపడాలని ఆకాంక్షించారు...

అల్లా దయతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆరోగ్యం, అభివృద్ధి కలగాలని ప్రార్థించారు. ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సమాజానికి శాంతి, శ్రేయస్సు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేస్తూ మరోసారి వర్ధన్నపేట నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ముస్లిం సోదరి సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



వరంగల్ ప్రతినిధి, మార్చి 20,తరంగాలు : పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం ఆత్మశుద్ధి, నియమ నిష్ఠలు, సహనం, దాతృత్వం వంటి మహత్తర విలువలను పెంపొందించే పవిత్ర కాలమని ఎంపీ డా. కడియం కావ్య పేర్కొన్నారు. ముస్లిం సోదరులు ఈ నెల అంతా సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు కఠిన ఉపవాస దీక్షలు ఆచరిస్తూ, క్రమశిక్షణతో జీవనం సాగించడం గొప్ప సంప్రదాయమని తెలిపారు. ఈ ఉపవాసాలు వ్యక్తిగత ఆత్మవికాసానికి మాత్రమే కాకుండా సమాజంలో సమానత్వం, పరస్పర గౌరవం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని వివరించారు. ప్రేమ, దయ, సహనం, సోదరభావం వంటి మానవతా విలువలను ఆచరిస్తూ, ఇతరులకు సహాయం చేయడం రంజాన్ పండుగ అందించే ప్రధాన సందేశమని ఎంపీ పేర్కొన్నారు. తెలంగాణలో గంగా–జమునా తహజీబ్‌కు రంజాన్ పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. ఈ పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా సమాజంలో ఐక్యత, సఖ్యత మరింత బలపడాలని, రంజాన్ పర్వదినం అందరి జీవితాల్లో ఆనందం, శాంతి, సుఖసంతోషాలను నింపాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకాంక్షించారు.

## మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ
- ,సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్



వర్ధన్నపేట ప్రతినిధి, మార్చి 20,తరంగాలు : మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ ,సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం జరుపుకోనున్న నేపథ్యంలో, ముస్లిం సోదరుల కోసం కాంగ్రెస్ నాయకులు, ముస్లిం సోదరులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం మత పెద్దలు మహమ్మద్ ఇబ్రహీం (అలియాస్ చోటే) ఘనంగా ఇఫ్తార్ విందును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ ,సీనియర్ నాయకులు పోశాల వెంకటేశ్వర్లు,ఐనవోలు దేవస్థాన డైరెక్టర్ గుంటి కుమారస్వామి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ్డం కుమారస్వామి,గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎద్దు రాజేంద్రప్రసాద్ తో వార్డు సభ్యులు భాషబోయిన ప్రవీణ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం మసీదు లో ఇఫ్తార్ సమయంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు (దువా) నిర్వహించారు. అనంతరం చోటే నివాసం లో విందులో కాంగ్రెస్ నాయకులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



# ప్రపంచ పిచ్చుకల దినోత్సవం





### పిచ్చుకలను ప్రకృతిలోకి విడిచిపెట్టిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ ప్రతినిధి, మార్చి 20,తరంగాలు : ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిచ్చుకల సంరక్షణపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పిచ్చుకలు పర్యావరణ సమతుల్యతకు సూచికలని, అవి జీవించాలంటే సహజ వాతావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. పట్టణీకరణ, కాలుష్యం కారణంగా పిచ్చుకల సంఖ్య తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని పిలుపునిచ్చారు. జిల్లా అటవీ అధికారి అనుజ్ అగర్వాల్ మాట్లాడుతూ, ఒకప్పుడు పిచ్చుకలు విస్తృతంగా కనిపించేవని, ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గిపోవడం ఆందోళనకరమని అన్నారు. పిచ్చుకలు నివసించే ప్రాంతాలు కాలుష్యం తక్కువగా ఉన్నవని సూచిస్తూ, వాటి సంరక్షణ కోసం ఇళ్ల వద్ద నీటి పాత్రలు, గూళ్లు ఏర్పాటు చేయాలని ప్రజలకు సూచించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో అధికారులు కలిసి పిచ్చుకలను ప్రకృతిలోకి విడిచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జిల్లా అటవీ అధికారి అనుజ్ అగర్వాల్, జడ్పీ సీఈవో రామిరెడ్డి, అడిషనల్ డీసీపీ (ట్రాఫిక్) ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



